**జరిగిన కథ :** రాచనగరిలోనూ ఓ కళామహిమ తెలిసిన అమ్మాయిని గుర్తించాడు జాయపుడు. అయితే, అందరిలా ఆమెతో కబుర్లు చెప్పుకొనే అవకాశం ఇక్కడ లేదు. ఎలాగైనా ఆమెను కలవాలనీ, కళా స్పందనలు పంచుకోవాలని అనుకున్నాడు. నాట్యంలో తన ప్రతిభను ఆమె ముందు ప్రదర్శించాలని భావించాడు. అయితే, వారిద్దరూ కలుసుకోలేని పరిస్థితి. ఇలాంటి సందర్భంలో..
జాయపుడు - ఇంద్రాణి కలిసే సన్నివేశం ఒకటి జరిగింది.



60
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

గణపతిదేవుడు వస్తున్నాడన్న వార్త తెలిసి.. చాలామంది పురుషులు కూడా వోణీల కార్యక్రమానికి వచ్చారు.

తల్లిదండ్రులతో ఇంద్రాణి కూడా హాజరయ్యింది.

అనేకానేక కులీన రాజయువతులలో ఆమె ఒక్కరుగా సామాన్యంగా ఉంది. కారణం.. ఒకరిని మించిన అందగత్తె ఒకరు. ఒకరిని మించి మరొకరు వారివారి తనూ లావణ్యాలకు నప్పే దుస్తులు, ఆభరణాలు ధరించి ఉన్నారు. రాచరికశోభతో అలరారుతున్నారు.

కానీ భావుకుడు, అనేకానేక కళల్లో పరిచయమున్న జాయపునికి.. ఇంద్రాణి కళాకారిణి అని తెలుసు కాబట్టి, ఆమె తనూ లావణ్యం అందరికంటే విభిన్నంగా తోచింది.

ఆమె ముఖం కళాత్మకత వెలార్చుతున్నది. ఆమె శరీరం స్పష్టాంగ రేఖాసమన్వితం. ఇక్షు కోదండంలా.. ఇటీవల రామప్ప దేవళం కోసం చెక్కుతున్న అలసా కన్యలా సన్నగా పొడవుగా సాగలాగినట్లుంది. ఆమె కాలు చేతులు మృదులములు.. పుష్టిమంతములు. నడక సున్నితంగానూ నేల కందిపోతుందేమో అన్నట్లు ఆచితూచి వేస్తున్నది అడుగు.

మొత్తంగా ఆమె గురుకులంలో చూసిన అనేకమంది కులీన యువతుల్లాగే ఉంది. కానీ, ముఖంలో తేజరిల్లుతున్న స్నిగ్ధత్వపు ప్రాకృతిక అందంలో మిళితమైన కళాత్మకత ఏదో ఇతరులనుంచి ఆమెను వేరు చేస్తున్నది. అంతలోనే నవ్వొచ్చింది. ఈమె ఆమెకంటే పూర్తిగా విభిన్నం! ఆమె కాకతి!!

అందరి ఆడపిల్లల్లాగే ఆమె కళ్లు చంచలిస్తూ.. అక్కడున్న యువకులను మౌనంగా పట్టి పరిశీలిస్తున్నాయి.

లిప్తమాత్రంలో.. ఎక్కువగా జాయపుణ్ని.

ఓ పక్కన పురోహితులు, శైవముఖ్యులు ఈనాటి ప్రధాన అంశమైన చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి చిన్నారి సుందరాక్షిని ఆశీర్వదిస్తుండగా.. రాజ్యంలోనే అత్యంత ఉన్నత కులీన కుటుంబాల పురుషులు, మహిళలు, యువతులు, పిల్లా జెల్లా ఆటపాటలతో, ముచ్చట్లతో మందిరమంతా పరిమళిస్తుండగా.. పెద్దలందరూ ఆత్మీయంగా తిలకిస్తున్నారు. మరికాసేపటికి మహారాజుతో పాటు పెద్దల ఆశీర్వచనం కూడా ముగిసింది.

అక్కడ అందరి కళ్లూ జాయపుని చుట్టూ తిరుగుతున్నాయి. అక్కడున్న యువకుల్లో అనేకులు అందగాళ్లు ఉన్నారు. సాక్షాత్తూ యువమహారాజు గణపతిదేవుడే తన చతురతతో, కబుర్లతో అందరినీ ఆకర్షించగలడు.

కానీ, ఈరోజు తన శారీరక ఉన్నతత్వంతో అందరినీ మించి వెలుగులీనుతున్నాడు జాయప. అతని తేజస్సు, కళాత్మకత కంటే అతని వయస్సు, అందచందాలు, పురుషత్వం, అందున్న వీరత్వం.. అన్నిటినీ మించి అతనికి చక్రవర్తితో ఉన్న అనుబంధం, దగ్గరితనం.. వారిని అసూయాగ్రస్తులను చేస్తున్నాయి. అదంతా వారి చూపుల్లో, మాటల్లో ద్యోతకమవుతున్నది.

చాలామంది యువకులు జాయపుణ్ని పలకరించి